# పెళ్లి చెయ్యకుండా చూడు

సరిగా కాఫీ వేళకు కనకయ్య వచ్చాడు. దాదాపు ప్రతి సాయంకాలమూ మా ఇంట్లో కాఫీ తాగే వేళకు కనకయ్య హాజరు. ఏ రోజునన్నా రాకపోతే మా ఆవిడతో "కనకయ్య ఊళ్ళో లేడల్లే ఉంది.... లేకపోతే జబ్బుచేసి మంచాన పడ్డాడో!" అంటాను.

"అయ్యో, పాపం? అట్లాగా? ఏం జబ్బు! పక్క వీథేగా? వెళ్ళి ఒకసారి తొంగిచూసొద్దామా? ఏం?" అంటుంది నా భార్య.

"ఎందుకూ?" అంటాను నేను ఆశ్చర్యంగా.

"కనకయ్యకు జబ్బుచేసిందని చెప్పరూ?" అంటుంది మా ఆవిడ.

"చెప్పరు! కనకయ్య ఇవాళ కాఫీకి రాలేదెందుచేతా! ఊళ్ళోగాని లేడా ఏమిటి! లేకపోతే జబ్బూ గిబ్బూ ఏమైనా పడ్డాడా? అంటావని అన్నాను. నే ననే దాన్లో నువ్వు ఎప్పుడూ సహమే వింటావుగనక...... ఎంతచెడ్డా అర్ధాంగివి గదా!" అంటాను.

నా మాటలకు కోప్పడాలో, నవ్వాలో, ఏమీ చెయ్యకుండా ఊరుకోవాలో తేల్చుకోవటానికి కొంత టైమవుతుంది. ఈ లోపల నేను విషయం మార్చేస్తాను.

కనకయ్య దాదాపు ప్రతి సాయంకాలమూ మా ఇంట్లో కాఫీ తాగుతాడు. అందువల్ల తన భార్యకు సాయంకాలంపూట కాఫీ చేసేపని ఉండటంలేదని కనకయ్య కుండబద్దలు కొట్టి చెప్పేస్తాడు. కనకయ్య భార్య కాఫీ తాగదనికాదు – సాయంకాలం తాగనని నియమంట – కొందరు శనివారం రాత్రిళ్ళు ఉపోషం ఉన్నట్టు.

"కనకయ్య భార్య సాయంత్రంపూట కాఫీ ఎందుకు తాగదంటారు?" అని నా భార్య నన్నొకసారి అడిగింది. ఆవిడ సాధారణంగా నన్ను ప్రశ్న వేసేది జవాబు తెలుసుకుందామని కాదు – నన్నడిగి తెలుసుకోదగినది ఏమీలేదని ఆవిడ ఏనాడో తెలుసుకున్నది. క్విజ్ మాస్టరు మనస్తత్వంతో, నాకు సమాధానం తెలుసునా లేదా అన్నట్టుగా ప్రశ్న వేస్తుంది. సరయిన సమాధానం – అంటే, ఆవిడ తన మనస్సులో అనుకున్న సమాధానం – నా నుంచి వచ్చిందా, "బాగానే కనిపెట్టారే!" అని నన్ను మెచ్చుకుంటుంది. లేదూ, అసలు నా సమాధానం – తిరుగులేని సమాధానం – తానే చెప్పి తనకే ఒక మార్కిచ్చుకుంటుంది.

"నాకు తెలీదు... కాఫీ తాగితే ఆవిడకు రాత్రిళ్ళు నిద్రపట్టదేమో?" అన్నాను.

"అదేమీ కాదు. పాలు ఆదా! పొద్దున మూడు అఠాకులు పాలు తీసుకుంటుంది. అందులోనే పొద్దున కాఫీలూ, రెండు పూట్లా మజ్జిగా రావాలి మరి. బలగం జాస్తి ఆయె. పొద్దుట కాఫీ పిల్లలకు పొయ్యదు. పెద్దవాళ్ళిద్దరే తాగుతారు. అదయినా ఏం కాఫీ? కొళాయి కాఫీ నయం. వాళ్ళు పోసుకునే మజ్జిగ? అడక్కండి. (నేనెందుకడుగుతానూ?) చలివేంద్రం నీళ్ళు."

మా ఆవిడ చెప్పినది నేను కాదనలేదు. అని ప్రయోజనం కూడా లేదు. కాని, నోరూరుకోక ఒకమాట మటుకు అన్నాను : "ఇతరుల పేదరికం గురించి అంత తేలిగ్గా మాట్లాడకూడదు."

మా ఆవిడ కా మాటతో ఆవేశం వచ్చేసింది. ఆవేశం వచ్చినప్పుడు ఆవిడ పరస్పర విరుద్ధమయిన వాదనలు కొల్లలుగా చేస్తుంది. వెనకటి కెవడో, "మా కుక్క ఈ మనిషిని కరవలేదు. మాకుక్క ఎన్నడూ ఎవరినీ కరవదు. మా కసలు కుక్కే లేదు" అని వాదించినట్టుగా.

తాను ఎవరినీ ఎందుకూ ఒక్కనాటికీ తేలికచేసి మాట్లాడనన్నది. కనకయ్య గారి ఆర్థికపరిస్థితి తలుచుకుంటే ఒక్కోసారి తనకు భయంకూడా వేస్తుందన్నది: అందుకే కనకయ్య పెళ్ళాం ఎప్పుడయినా ఓ చిన్న గిన్నెడు పంచదారో, పెద్ద గిన్నెడు రవ్వో అప్పు పట్టుకెళితే, తాను తిరిగి తీసుకోనన్నది. ఆ మాటకువస్తే నేనుకూడా ప్రతిదానికీ అందర్నీ ఎద్దేవా చేస్తాననీ, అది తనకు బాగుండదనీ అన్నది. ఒక ఉదాహరణ ఇయ్యమంటే, నేను చిట్టా రాసి పెట్టుకున్నానా యేం? ఈసారి ఎద్దేవా చేసినప్పుడు గ్యాపకం చేస్తానన్నది. గ్యాపకం చేసేదేగాని, ఆ మాట మరిచిపోయి వుంటుంది.

కనకయ్య రోజూ కాఫీ వేళకు హాజరువుతాడా, మా ఆవిడ చేతి కాఫీని మెచ్చుకోడు. ఇంట్లో కొళాయి కాఫీనీళ్ళు తాగేవాడికి మా యింటి కాఫీ బాగానే ఉండాలిగదా! ఎంచేతంటే మా ఆవిడ కాఫీకి వాడే పాలలో సగానికి సగమే నీళ్ళు కలుపుతుంది. అదైనా పొద్దుటి పూట పాలలో సగం నీళ్ళే కలుపుతుంది. సాయంత్రం పూట కనకయ్య కూడా కాఫీ పంక్తిన ఉంటాడుగనక, మందికొద్దీ మజ్జిగ లాగా, కాఫీ కొంచెం నీళ్ళుగానే ఉంటుంది.

అసలు సంగతేమిటంటే, కనకయ్య మా ఆవిడచేతి కాఫీని ఎన్నడూ మెచ్చుకోడు. తనకు ఎవరెవరు ఎప్పుడెప్పుడు మంచికాఫీ ఇచ్చారో జాబితా చదువుతాడు – ఎందుకు? నే నా ప్రశ్న మా ఆవిణ్ణి ఎన్నడూ వెయ్యలేదు. వేస్తే నా క్కావలసిన సమాధానం చెప్పదు. ఆ సమాధానం ఏమిటి అంటే? ఇంకోళ్ళ కాఫీని మెచ్చుకుంటే మా ఆవిడ వాళ్ళతో

పోటీపడి తనకింకా మంచి కాఫీ ఇస్తుందేమోనని! కావచ్చు. కాకపోవచ్చు. అందరిలాగే నా ఊహ నాకు బాగుంటుంది. మా ఆవిడలాగా నా ఊహే రైటని నేను పట్టుబట్టను.

అయినా అప్పుడప్పుడూ నేను మా ఆవిణ్ణి ప్రశ్నలు వెయ్యకుండా ఉండను. ఒకసారి పైకి అనుకునే స్వగతంలాగా అన్నాను: "ఈయన రోజూ సాయంత్రంపూట కాఫీకి వస్తాడుగదా! ఆయన ఇదిగా ఫీలవడా? (తెలుగులో ఏమనాలో తెలీదులెండి) మనమైతే అట్లా రోజూ ఇంకోరింటికి – హోటలు కెళ్ళినట్టు వెళ్ళి కాఫీ తాగి, ఖాతా వున్నవాడిలాగా వెళ్ళిపోగలమా?"

"మీరు మరీనూ!" అన్నది మా ఆవిడ. "ఆయన స్పష్టంగా చెబుతూనే ఉండెనుగా – తన భార్య ఒక్కడికోసం కాఫీ చెయ్యటం ఎందుకనీ? అదీగాక పాలు చాలవాయె! ఒక్కకప్పు కాఫీ చెయ్యటం ఎంతకష్టమో మీ మగవాళ్ళకేం తెలుస్తుంది? కాకపోయినా, మంచీ చెడ్డా విచారించేవాడుగదా. ఓ పూట ఇన్ని కాఫీనీళ్లు పోస్తే, ఇంతలో మనమేంవీ పేదవాళ్ళమైం పోంలెండి" అన్నది మా ఆవిడ. ఇంకా చాలా అని ఉంటుంది – నాకు జ్ఞాపకం ఉండిచావ్వు. నా నోటంబడి వచ్చిన సెంటిమెంటు తప్పని రుజూ చెయ్యటంలో మా ఆవిడకు మంచి డిస్టింక్షన్ ఉన్నది.

నా ప్రశ్నకు నా మనసులో ఉన్న సమాధానం వేరు. నేను ఉద్యోగంలో బల్లకిందనించి వసూళ్లు చేసి అక్రమంగా కొంత ఆర్జించిన సంగతి కనకయ్యకు తెలుసు. "నీకేం లేవయ్యా? అసలు సంపాదనకన్న పై సంపాదన హెచ్చు!" అని అప్పుడప్పుడూ అంటూ వుంటాడు. నేను నమ్రతగా "ఆఁ, నా బొంద సంపాదన!" అంటాను గాని, నిజం ఆయనకు తెలుసు. తెలిసి నన్ను బ్లాక్‌మేల్ చేస్తున్నాడని నా నమ్మకం. అయితే కొంతలో కొంత మంచివాడు గనక నన్ను తేలిగ్గా రోజువారీ కాఫీతో పోనిస్తున్నాడనుకుంటాను. అదే మరో గండ్రమనిషైతే, "ఓ వంద రూపాయలు అరిజెంటుగా కావాలిసొచ్చింది ఇస్తావా?" అనేసును. ఏ మాట కామాటే చెప్పుకోవాలి; కనకయ్య అటువంటి సజ్జుకాదు. నేను పై సంపాదన ఒడుచుకున్నానని అతడికి లోపల సంతోషమే.

అయితే నా ఈ ఊహ తప్పని ఇప్పుడు నాకు తెలుసు. ఇంకొంచెం సేపుంటే మీకు తెలిసిపోతుంది; కాస్త ఓపిక పట్టండి. కనకయ్య నిజంగా నేననుకున్నంత మంచివాడా! అతను నన్ను బ్లాక్‌మేల్ ఎందుకు చెయ్యటంలేదు? రోజూ ఏ సాహంతరంతో వచ్చి మా ఇంట్లో కాఫీ తాగి, మంచీ చెడ్డా మాట్లాడి వెళుతున్నాడు? ఈ ప్రశ్నల కన్నిటికీ సమాధానాలు, గుడ్డులోంచి పిల్లలు బయటికొచ్చినట్టు వచ్చేస్తాయి.

అవును, సరిగా కాఫీ వేళకు కనకయ్య, రోజూలాగే, ఆ రోజూ కూడా మా ఇంటికి

వచ్చాడు. ఆయనవచ్చి కూర్చున్నాడు; మా ఆవిడ వంటింట్లోనుంచి కాఫీ వాసన తెప్పిస్తున్నది. అంతలో మా కాంతం కాలేజీనుంచి ఇంటికొచ్చేసింది.

కాంతం అంటే మా అమ్మాయి. ఏకపుత్రిక. దానికప్పుడు పదహారోఏడు. పీయూసీ చదువుతున్నది. రోజూ కాంతం ఇంతకన్న చాలముందుగానే వస్తుంది. రాగానే ఇన్ని పాలు తాగి పైకి వెళ్ళి కనకయ్య పోయాకగాని కిందికిరాదు. దానికెందుకో కనకయ్యంటే తగని మంట. ఎందుకో ఏమిట్లెండి, రోజూవచ్చి కాఫీ తాగిపోతాడనే.

"ఇవాళ ఆలస్యం అయినట్టుందేఁవే?" అన్నా.

"ఏదో డిబేటుట. వాళ్ళమొహం డిబేటు. ఒక్క వెధవక్కూడా మాట్లాట్టం చాతకాదు" అని గొణుక్కుంటూ కాంతం విసురుగా స్నానాలగదికి పోయింది.

"పిల్లను ఇంకా ఎందుకు చదివిస్తున్నావయ్యా వెర్రిబ్రాహ్మడా! మానిపించక?" అన్నాడు కనకయ్య.

"ఎందుకూ మానిపించటం?" అన్నాను.

"ఎందుకొచ్చిన చదువులు? పెళ్ళి సంబంధాలు చూడు" అన్నాడు.

"ఇప్పణ్ణించే పెళ్ళేమిటి? దానికి పదహారోయేడు నడుస్తున్నది."

"నన్ను మా అమ్మ పన్నెండో ఏట కడుపుతో ఉంది" అన్నాడు. అందుకు కనకయ్య చాలా గర్వపడ్డట్టు కనిపించాడు.

"ఈ 1961లో కూడా అలాగే బతుకుదామనా నీ ఉద్దేశం? నేను కాస్త ముందుకు పోదామనే దృష్టితో ఉన్నవాణ్ణి" అన్నాను గర్వంగానే.

"సరేలే! ఎవరొద్దన్నారు? ఇప్పణ్ణించీ సంబంధాలు చూడటం మొదలు పెడితే నాలుగేళ్ళకు దొరికినా దొరికినట్టే. మా బావమరిది కామయ్య తన కూతురికి ఆరేళ్ళనించీ సంబంధాలు చూస్తున్నాడు. ఇంతవరకూ అతీగతీలేదు. దానికి పద్దెనిమిదో ఏడు కూడా వచ్చేసింది" అన్నాడు కనకయ్య.

"అంటే పిల్లకు పన్నెండో ఏటి నుంచీ చూస్తూన్నారన్నమాట? ఒకవేళ వెంటనే సంబంధం దొరికితే ఏం చేసేవారు?"

"ఏం చేసేవారేమిటయ్యా పిచ్చి బ్రాహ్మడా! నిక్షేపంగా పెళ్ళి చేసేవారు. నన్ను కనేనాటికి మా అమ్మకు పదమూడోయేడు."

"లేదులెండి. మా అమ్మాయికి పెళ్ళి చేయదలచుకున్ననాడే సంబంధం వెతుకుతాను. నాకు వెంటనే సంబంధం దొరుకుతుందని ఎందుకో అనిపిస్తున్నది. పెద్దవారు చెప్పారుగదా అని రేపు సంబంధం వెతకటం మొదలుపెట్టాననుకోండి, ఎల్లుండికల్లా దొరకుతుంది. అప్పుడు వాళ్ళను నాలుగేళ్ళు ఆగండి అంటే వాళ్ళ కోపం రాదూ?"

"అంటే ఇరవై ఏళ్ళదాకా పెళ్ళిచేసే ఉద్దేశ్యం లేదన్నమాట!" అంటూ లోపల ఏదో ఆలోచించుకుని, కనకయ్య, లాభంలేదన్నట్టు తల అడ్డంగా తిప్పాడు. నాకు లేని బెంగ ఆయనకెందుకో నా కర్థం కాలేదు.

"సరిగా చెప్పారు. ఇరవై కాదు, ఇరవై ఒకటి పూర్తి అయితేగాని దాని పెళ్ళి తలపెట్టను. ఇరవై మీదు ఒకటి కొసరు ఎందుకని అడగ్గల్రు. అప్పటికది ఎమ్మే కూడా పాసైపోతుంది. నిక్షేపంగా ఏ లెక్చరరో అయి మరీ పెళ్ళి చేసుకుంటుంది. అదీ నా అంచనా" అన్నాను.

"ఆడపిల్లలకు ఎమ్మేదాకా చదువూ, ఉద్యోగమూనా?" ఆయన మళ్ళా తనలో తాను ఏదో మాట్లాడుకుని, తల మళ్ళీ అడ్డంగా తిప్పాడు.

ఆ రోజుకా సంభాషణ అంతటితో పోయింది.

నేను కనకయ్యగారితో చిన్నమెత్తు అబద్ధం చెప్పలేదు. మా కాంతమ్మ పెళ్ళికి నేను వేసుకున్న ప్రోగ్రాం అక్షరాలా అదే.

ఈడొచ్చిన ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు చేసే వాళ్ళు పడే పాట్లు నేను కళ్ళారా చూశాను.

పెళ్ళిచేసే ఉద్దేశ్యంతో, పిల్ల పెద్దమనిషి కాగానే చదువు మానిపించేసిన వాళ్ళను చూశాను. వాళ్ళకు చదువా చెడిపోయింది. బుద్ధి పెళ్ళిమీదికి, దాంపత్య సుఖం మీదికి మళ్ళింది. ఆ తరువాత వెంటనే సంబంధం కుదిరి కాపరానికి వెళ్ళిపోయిన పిల్ల అదృష్టవంతురాలు. కాని ఆ అదృష్టం అందరికీ పట్టదు.

మగపిల్లవాడి తరఫు మనుషుల్లో ఎటువంటివాళ్ళున్నారని! పిల్ల స్కూలు ఫైనలుదాకా చదివిందంటే, అంత చదువా అని మంచినీళ్ళు కూడా అడక్కుండానే లేచిపొయ్యే వాళ్ళున్నారు. చదువు మానిపించి సంబంధాలు చూస్తున్నారంటే, పెళ్ళి తొందరలో ఉన్నారని గ్రహించి, అడుగుదామనుకున్న దానికంటే వెయ్యో, రెండు వేలో హెచ్చుకట్నం అడిగేవాళ్ళున్నారు.

చాలా సంబంధాలు చూడకుండా, ఎదురైన మొదటి సంబంధం ఖాయం చేస్తే అయినవాళ్ళూ కానివాళ్ళూ కూడా "కక్కుర్తిపడ్డారు!" అంటారు. 'ఇంకొంచెం శ్రద్ధ తీసుకుని వెతికితే ఇంతకన్న దివ్యమైన సంబంధం దొరికేది' అంటారు....

నాకు నేనే అడ్డొస్తున్నాను. క్షమించండి. ఈ రకం వాళ్ళను చూస్తే ఆడవాళ్ళు చీరెలబేరం చేసే పద్ధతి గ్యాపకం వస్తుంది. మా ఆవిడ 'కాట్టిడుపు' అనబడే కట్టు - విడుపు చీరె - పన్నెండు రూపాయలు మించనిది - కొనటానికి ఊళ్ళోకల్లా పెద్ద బట్టల షాపుకి పోయింది. ముందు బ్రోకేడ్‌తో ప్రారంభిస్తుంది. షాపువాడు మీటరు నూటయిదు రూపాయలంటాడు. 'అబ్బో! కొంచెం తక్కువలో చూపించండి' అని బెనారస్ పట్టు చీరెలూ,

కంచిపట్టు చీరెలూ, గ్రేడువారీగా అన్నీ చూసి, ఎందుకైనా మంచిదని ఏడెనిమిది రూపాయల్లో పనివాళ్ళ కివ్వటానికి పనికొచ్చే చీరెలు కూడా విప్పించి చూసి, చివరకు తనకు కావలిసిన చీరె పన్నెండుకో, పదమూడుకో కొని ఇంటికొస్తుంది.

ఇటువంటి మనస్తత్వం గలవాళ్ళుంటారు కొందరు. కట్నం యాభై వేలు అడుగుతున్నారని తెలిసి కూడా, విచారిస్తే తప్పేం అన్న మనస్తత్వంతో మాట్లాడి చూస్తారు. సంబంధాలు చూడటం వాళ్ళకొక వినోదం.

కాని ఈ లోపుగా పెళ్ళి కావలసిన పిల్ల నలిగి, శూన్యమై, బెంగపడి, మనోవ్యాధి తెచ్చుకుంటుంది. పెద్దవాళ్ళు దురాశకొద్దీ తమ తాహతుకు మించిన సంబంధం తెస్తుంటే, అందులో కొన్ని అయినా పిల్లకు నచ్చుతాయి; పెళ్ళిచూపులకు వచ్చే వాళ్ళలో కొందరు కుర్రాళ్ళయినా పిల్లకు నచ్చుతారు. 'కాట్టిడుపు' చీరె కొనవచ్చిన యిల్లాలికి బ్రొకేడ్ చూపించేవాడు గడుసువాడు గనక, కొనరని తెలిసి కూడా చూపిస్తాడు. అక్కర్లేదనగానే నిర్లిప్తంగా ఉండకేంజేస్తాడూ? వాడు జీతం డబ్బులకు పనిచేసే షాప్ అసిస్టెంటాయె. వచ్చిన యిల్లాలు బ్రొకేడ్ కొన్నా, 'కాట్టిడుపు' చీరె కొన్నా వాడికి ఒకటే. కాని, పెళ్ళి కావలసిన పిల్ల అంత గడుసుగా ఎట్లా ఉంటుంది? అవకాశం దొరికినప్పుడల్లా దానికి ఆశ పైకి తంతుంది. అట్లా పైకి తన్నిన ఆశ నిరాశ కాగానే గజం లోతుకు కుంగిపోతుంది. ఇట్లా ఏడాదో, రెండేళ్ళో, మూడేళ్ళో ఆశ నిరాశల మధ్య నలిగిన పిల్ల కాస్త సుకుమార ప్రాణి అయితే మంచం పట్టినా ఆశ్చర్యంలేదు.

కొందరికొక అపోహ ఉన్నది. కట్నం పారేసి కొండమీది కోతిని తీసుకురాగలమని అనుకుంటారు. అనుకోవడమేమిటి తెస్తారు కూడా. కాని వాళ్ళకు చివరకు దక్కేది కోతే. కొండమీద ఉండే కోతికున్న విలువ కొండ దిగివచ్చిన కోతి కుండదేమో మరి. డబ్బుకోసం పెళ్ళాడేస్తాడు. ఆ తరవాత ఆ కోతి రకరకాల కుప్పిగంతులూ వేస్తాడు. పిల్ల జీవితం భ్రష్టే.

ఈ సోదంతా ఎందుకు చెప్పాననంటే, ఎట్లాగైనా చూడండి వయసు వచ్చిన ఆడపిల్లల పెళ్ళి సమస్యకు సాఫీ అయిన పరిష్కారం లేదు. ఉన్నది – కాని అమలు జరగటం చాలా కష్టం. పిల్ల చదువుకుని లోకజ్ఞానం సంపాదించి, ఆర్థికంగా తన కాళ్ళమీద తాను నిలబడి, తన భావి భర్తను తానే వెతుక్కోవటం. దీన్ని ప్రేమించి పెళ్ళాడటం అనాలని ఉంటే అనండి. కాని నేను ప్రేమప్రసక్తి తీసుకురాను. ఓ విధమైన స్వయంవరం. ఒకప్పుడు రాజులలో ఆనవాయితీగా ఉండేది. ఇప్పుడందరికీ ఆచరణ యోగ్యమే.

అట్లా చేస్తే ఆడపిల్ల చెడ్డమార్గం తొక్కుతుందని భయపడి చస్తారు. కట్నంకోసం తన కిష్టంలేని పిల్లను చేసుకుని, వాడు ముండల ముఠాకోరయితే సంఘానికి జరగని

ఘోరమైన అన్యాయం, ఆడది తన మొగుణ్ణి వెతుక్కోవటంలో తప్పటడుగు వేస్తే జరుగుతుందని నేను నమ్మలేను. సంఘాన్ని అధోగతికి ఈడ్చే హక్కు మగవాడికే ఉంది; ఆడదానికి లేదు. 'స్త్రీషు దుష్టాసు జాయతే వర్ణ సంకరః!' అనే వాళ్ళకు నేను చెప్పలేను. నాకు తెలిసినమటుకు, తమ ప్రవర్తనతో సంఘాన్ని కలుషితం చేసేపని పెళ్ళయిన ఆడవాళ్ళు చాలామంది చేస్తున్నారు. వాళ్ళను ఎవరూ ఏమీ చెయ్యలేకుండా ఉన్నారు.

చివరకు నేను తేల్చుకున్న దేమిటంటే, ఆర్థికంగా తన కాళ్ళమీద తాను నిలబడగలిగిన దాని ప్రవర్తనను పైవాళ్ళు శాసించలేరు. సినిమాతారలను పెళ్ళాడే వాళ్ళు వాళ్ళ కన్యత్వాన్ని చూసే పెళ్ళాడుతున్నారని నేనెన్నడూ అనుకోలేదు. ఆస్తో ఆర్జనో ఉన్నదనే హజంతో వేలకు వేలు కట్నాలడిగే దౌర్భాగ్యులు దేశంలో ఉండగా లేందీ, తన ఆర్థిక స్వాతంత్ర్యాన్ని ఆధారం చేసుకుని తనకు కావలసిన భర్తను తాను వెతుక్కునే ఆడవాళ్ళు ఎందుకుండరాదు? ఆ ఆడది తన భర్తను ఏ విధంగా వెతుక్కుంటుందో మిగిలిన వాళ్ళకెందుకు?

మీరు గ్రహించేవాళ్ళు గనక ఈ విషయాలన్నీ దాపరికం లేకుండా మీతో చెబుతున్నాను గాని, మా ఆవిడతో అంటే ఇంకేమన్నా ఉందా? అసలే నా నోట వచ్చే మాటల్లో తొంభైతొమ్మిది శాతం తప్పుల తడక! మా ఆవిడతోనే అనని మాటలు కనకయ్యతో ఎందుకంటాను? ఆయన మా మంచిచెడ్డలు విచారించేమాట నిజమే గాని, ఈ విషయంలో ఆరుస్తాడా, తీరుస్తాడా? ఆయనకు కావాలసింది కప్పు కాఫీ, తాగి వెళ్ళనీ! కావలిస్తే మా అమ్మాయి పెళ్ళి గురించి స్వగతం మాట్లాడుకుని, తల అడ్డంగా తిప్పుకోమను నాకేమీ అభ్యంతరం లేదు.

నేను మాత్రం ఏనాడో నిర్ణయించుకున్నాను: 'పెళ్ళి చెయ్యకుండా చూడు!"

తరవాత కొన్ని రోజులపాటు కనకయ్యగారు మామూలుగా వస్తూ, కాఫీ తాగిపోతూ వచ్చాడు. కాని మా కాంతం పెళ్ళి గురించి మాట్లాడలేదు. తల అడ్డంగా తిప్పనూలేదు.

కాని ఒకరోజున కాఫీ తాగుతూ, ఆయన, యథాపలంగా, "మా పెద్దవాడు పట్టాభికి సంబంధాలు వస్తున్నాయయ్యా! రోజూ చెబుదామనుకుని మరిచిపోతున్నాను!" అన్నాడు.

"పట్టాభికి ఇరవై ఇంకా నిండలేదేమో?" అన్నాను.

"నిండుతాయనుకో. కాకపోయినా నాలుగు సంబంధాలు చూసి, ఉన్నంతలో మంచి సంబంధం ఏరుకోక తప్పేదేముందీ? బ్రహ్మముళ్ళు అదివరకే పడి ఉన్నా, దైవయత్నంతోపాటు పురుష యత్నం కూడా ఉండొద్దూ మరీ? చివరకు రాసిపెట్టి ఉన్న సంబంధమే జరుగుతుందిలే. అయినా, ఉన్నంతలో మంచి సంబంధం వెతికామన్న తృప్తి మన కుండొద్దూ?" అన్నాడు కనకయ్య.

"సరిగ్గా నేననుకున్నదీ అదేసుమండీ! ఆడపిల్లల పెళ్ళి విషయంలో కూడా చూశారూ? మనం ఎన్ని సంబంధాలు వెతికినా, పిల్లకు ఏ కిరస్తానీ వాడో రాసిపెట్టి ఉందనుకోండి; వాడితోనే దానికి పెళ్ళి అయిపోతుంది. తీరా పెళ్ళి అయిపోయాక మనం పిల్లను తప్పుపట్టరాదు. కాకపోతే మన ప్రయత్నం ఫలించిందన్న తృప్తి మనకుండకపోవచ్చు. నేనెరిగిన భూస్వామి ఒకాయన తన కూతుర్ని లక్ష రూపాయల కట్నంతో, అమెరికా వెళ్ళబోతున్న కుర్రాడికిచ్చి పెళ్ళిచేసి, వాడి ప్రయాణపు ఖర్చులు కూడా తానే భరించాడు. వాడు అమెరికా వెళ్ళి, అక్కడ ఏ తెల్లదాన్నో చేసుకున్నాడు" అన్నాను.

కనకయ్య నా ధోరణికి తెల్లబోయి, "మగపిల్లవాడికి సంబంధాలు వెతికేదారివేరూ, ఆడపిల్లలకి వెతికేదారి వేరూనూ!" అన్నాడు.

మా ఆవిడ కనకయ్యను గట్టిగా బలపరిచి, "ఆడపిల్లల విషయంలో దేవుడి మీద భారం వేయటం ఎంతమాత్రమూ కూడదు" అన్నది.

"అంటే మగపిల్లల పెళ్ళి దేవుడూ, ఆడపిల్లల పెళ్ళి మనుషులూ చేస్తారా యేం?" అన్నాను.

"మీదంతా తల్లకిందులు వాదం! ఆడపిల్లల పెళ్ళి విషయంలో దైవయత్నమూ, మానవయత్నమూ ఓ దానికొకటి విధిగా కలిసిరావాలి. మగపిల్లవాడి పెళ్ళి విషయంలో అంత పట్టింపులేదు" అన్నది మా ఆవిడ.

"చక్కగా చెప్పావమ్మా! చూడు, నాయనా! నువు చెప్పిన భూస్వామి తన కూతురు విషయంలో పొరపాటు పడ్డాడని ఎవరూ అనటానికి వీల్లేదు. నిక్షేపమంటి సంబంధం చూశాడు. ఘనంగా పెళ్ళిచేశాడు. నన్నడిగితే మహా దొడ్డమనిషి. ఆ పిల్లగీత బాగాలేక అట్లా అయితే దానికెవరేం చేస్తారు!" అన్నాడు కనకయ్య.

"ఆయన పెళ్ళే చెయ్యక, తమ కమతగాడికిచ్చి చేస్తే ఎవరేం చేసేవాళ్ళంటారు?"

కనకయ్య దిగ్భ్రమ చెందినవాడల్లే అయిపోయి ఏమీ జవాబు చెప్పలేదు. నాతో మాట్లాడటం మా ఆవిడకు నల్లేరుమీద బండినడక గనక, "అందరూ మొహాన ఉమ్మేసి ఉండేవాళ్ళు!" అన్నది.

"అది మటుకు నిజం కాదు. ఆ అమ్మాయి నిక్షేపంగా కమతగాడితోనే కాపరం చేస్తున్నది. ఎవరూ ఏమీ అనటంలేదు" అన్నాను.

"చాటుగా ఏం వేడుస్తున్నదో. బహిరంగంగా పెళ్ళి చేసుకోవటమూ, అదీ ఒకటి ఎట్లా అవుతుంది?" అన్నది మా ఆవిడ.

"అదీ అసలు సంగతి. చాటుగా ఏం చేసినా తప్పులేదు. బహిరంగంగా చేస్తేనే తప్పు! ఆ మాట నేను ఒప్పుకోలేను. ఈ చాటుమాటు వ్యవహారాలతోనే సంఘం ఇంత అధోగతికి వచ్చింది" అన్నాను.

కనకయ్య మాటమార్చి, "ఇంతకూ మా అబ్బాయికి సంబంధం వెతకటం విషయమై నీ సలహా ఏఁవిటి?" అన్నాడు.

"అన్నీ తెలిసినవారు. మీకు నేను సలహా ఇవ్వడమేఁవిటి? అయినా ఏ విషయం సలహా అడుగుతున్నారు?" అన్నాను.

"మగపిల్లవాడికి పెళ్ళి అన్నంత మాత్రాన ముందూ వెనకా ఆలోచించక్కర్లేదనా నీ ఉద్దేశం? నన్నడిగితే, ఓ విధంగా ఆడపిల్ల పెళ్ళి ఎంత కష్టమో, ఇంకో విధంగా మగపిల్లవాడి పెళ్ళికూడా అంత కష్టమేనయ్యోయ్! మాటవరసకి చెబుతా – పిల్ల అందం చూడాలా, కట్నం చూడాలా? పిల్లవైపు వాళ్ళ వంశమర్యాద చూడాలా, హోదా చూడాలా? పిల్ల అందంగా ఉంటే పిల్లవాడికి సంతోషం. కట్నం బాగా వస్తే మాకు సంతోషం. నాకూ ఆడపిల్ల లున్నారాయె; ఇక్కడ పుచ్చుకుంటే అక్కడ ఇవ్వొచ్చు మరి! మర్యాదగల కుటుంబమైతే అల్లుణ్ణి గౌరవంగా చూస్తారు. హోదా గలవాళ్ళయితే అవసరానికి ఆదుకుంటారు. ఏమంటావ్? నేచెప్పింది సబబుగా ఉందా? ఏఁవమ్మా! మాట్లాడవేం?" అన్నాడు కనకయ్య.

"కాదుటండీ మరీ?" అన్నది మా ఆవిడ. ఆ తరవాత నేను మరోవిధంగా అనటానికి అవకాశం ఇవ్వకుండా.

"మీరు చెప్పిన నాలుగూ ఒనకూడటం ఉత్తమం. మూడు ఒనకూడితే మధ్యమం, రెండు ఒనకూడితే సంసారపక్షం. ఏదో ఒక్కటే చూసుకోవటం అధమం" అన్నాను.

మా ఆవిడ నా మాటలను పూర్తిగా కొట్టి అవతలపారేసింది.

"ఆయనకేం తెలుసునని ఆయన్నడుగుతున్నారు? ఆయన కా ఉద్యోగం చేసి నాలుగురాళ్ళు తీసుకురావటం తప్ప ఇంకేమీ తెలీదు. నన్నడగండి చెబుతాను. పెళ్ళి విషయంలో ఇదా అదా అని చూడటాలు పనికిరావు. అన్నీ ఉండవలసిందే. కాకపోతే పిల్ల నిజంగా అందమైందైతే, కట్నం ఓపిసరు తగ్గినా ఒప్పుకోవచ్చు. అవతలివాళ్ళు నిజంగా పెద్ద హోదాగలవాళ్ళయితే కుటుంబ గౌరవం కాస్త అటూ ఇటూ అయినా సరిపెట్టుకోవచ్చు. ఎంతో తెలివిగా చూచి మరీ సంబంధం చూసుకోవాలి. అంతేగాని నాలుగూ, మూడు, రెండూ అని లెక్కలేఁవిటి? ఎవరన్నా వింటే నవ్విపోతారు!"

ఎవరన్నా వింటే నవ్విపోయేది నా మాటకే నని తమరి కందరికీ అర్థమయే ఉంటుంది. మాటమార్పు అవసరమనిపించింది.

"ఇంతకూ మీవాడికి ఇరవయ్యే కాదుటండీ? ఇంకా అయిదేళ్ళు మహారాజుగా ఆగవచ్చు" అన్నాను.

మీదగ్గిర దాచటం దేనికీ? కావాలనే ఆ మాట అన్నాను. అదో చిన్న ప్రయోగమనండి. ఫలితం వెంటనే కనబడింది. కనకయ్యగారు ఒక చిన్న చిరునవ్వు నవ్వి, "ఆ మాటన్నావు, బాగుంది!" అన్నాడు.

"అమ్మ ముండాకొడకా? అదా నీ కడుపులో ఆలోచన!" అనుకున్నాను.

వాళ్ళ పట్టాభికి మా కాంతాన్ని చేసుకోవాలని ఆ ముసలాడి ఆలోచన. అందులో బ్లాక్‌మేల్ లేకపోవటమేం? ఉంది! నా ఏకపుత్రిక తన కోడలవుతుందన్న ఆశతోనే నాపైన సంపాదన గురించి చాలా వుదారంగా ఉంటున్నాడు. కాబోయే వియ్యంకుడి హోదాలో రోజూ మా యింటికొచ్చి కాఫీ తాగుతున్నాడు.

వాళ్ళ పట్టాభికి నిలువునా బంగారు తొడుగు దిగేసి, వేంకటేశ్వరస్వామిలాగా మొహం కనబడకుండా వెండి నామాలు పెట్టినా, మా కాంతాన్ని వాడికివ్వను. గొట్టం పాంట్లూ, ఆడారినడకా వాడూనూ! కానీ కట్నం అడక్కపోయినా, ఆఖరుకు ఎదురుకట్నం ఇస్తానన్నా కాంతం వాణ్ణి చేసుకోదు. ఈ సంగతి బయటికి అనేశానో రెండు విధాల డేంజర్!

ఒకటి : మా ఆవిడ అంతకన్న మంచి సంబంధం లేదనే నిర్ణయానికి వచ్చి, రేపే ముహూర్తం పెడదామని కూర్చోవచ్చు. నేనేదన్నా మంచిదన్న మరుక్షణం దానంత పాడుపనేది లేదని తేల్చుకునే మనిషి, ఏదన్నా నేను వద్దనుకుంటే అది కావాలనుకోవటంలో ఆశ్చర్యం ఏముంటుందీ?

మా ఆవిడ లోకం మంచిచెడ్డలను గురించి అట్లా వ్యతిరేకంగా ఆలోచించడం కేవలమూ నా మీది కచ్చకొద్దీ అనుకోకండి. చాలా పరిమితమైన జీవితానుభవం - పుస్తక జ్ఞానం అసలేలేదు - ఇంత సంపన్నంగా నలుగురికీ కనిపించే కుటుంబానికి ఆడదిక్కు; ఈ పరిస్థితుల్లో మా ఆవిడకు ప్రతి విషయం గురించీ ఓ ఖచ్చితమైన అభిప్రాయం లేకపోతే నలుగురిలోనూ ఘరానాగా కనబడలేదు. అందుచేత తనకు బొత్తిగా తెలియని విషయాలను గురించి నే ననుకునేదానికి విరుద్ధంగా ఆలోచించటం ఒక ఈక్వేషన్‌గా పెట్టుకున్నది - "కంఠాభరణం"లో అవధాన్లు సంస్కృతం మాటలే అని నిర్ధారణ చేసుకున్నట్టుగా! ఈ ఈక్వేషను మా ఆవిడకు పనిచేస్తున్నది. చుట్టుపక్కల ఆడవాళ్ళందరికీ మా ఆవిడంత తెలివిగలది లేదనే! ... ఆవిడ స్టంప్ అయేది ఎప్పుడంటే, నేను ఏ అభిప్రాయమూ ప్రకటించకుండా రాయల్లే కూచున్నప్పుడు.... అంతేగాని.... మీరు మా దాంపత్యం గురించి అపోహలు పడనవసరం లేదు. ఆవిడకు నిజంగా తెలిసిన విషయాలుంటాయే, వాటి దగ్గిర మేము ఎప్పుడూ ఏకీభవిస్తూనే ఉంటాం.

పోతే - రెండు : మా కాంతాన్ని తన కొడుక్కిచ్చి చేసే ఆలోచన నాకు ఏ కోశానా లేదని తెలిస్తే, రేపటినుంచే కనకయ్య లంచగొండినని నన్ను గురించి టముకు వెయ్యనారంభిస్తాడు. అందువల్ల నేను వెంటనే జైలుకు పోతానని కాదు. కన్నుపోయినంత

కాటు కెందుకూ? నా అనుమానం నిజమవునా, కాదా అన్నది తేల్చుకునేటందుకూ, ఒకవేళ నిజమైతే అయిదేళ్ళపాటు కనకయ్య నోటికి కప్పతాళం వేసి ఉంచటానికీ ఆ మాట అన్నాను.

నా ఎత్తుపారింది. “ఆ మాట అన్నావు, బాగుంది!” అన్నాడు మానవుడు. అయిదేళ్ళ అనంతరం వాళ్ళ పట్టాభి కివ్వటానికి వాగ్దానం చేస్తున్నాననే అనుకుని, మా అమ్మాయికింకా అయిదేళ్ళదాకా పెళ్ళి చెయ్యనంటిని. వాళ్ళబ్బాయికి అయిదేళ్ళదాకా పెళ్ళి తొందరలేదని ఆ నోటితోనే అంటిని. ఎవరన్నా అటువంటి గోతిలో అతిసులువుగా పడతారు.

పర్ఫెక్ట్ మర్డర్ లాగే తిరుగులేని మోసం కూడా ఉండదేమో ననుకుంటాను. నా ఎత్తు బ్రహ్మాస్త్రంలాగా పారలేదు. అలోపతీ ఔషధంలాగా ఒకరోగాన్ని నయంచేసి సైడ్ ఎఫెక్ట్స్ తెచ్చిపెట్టింది.

అది మొదలు కనకయ్య రోజూ కాఫీ తాగటానికి వచ్చి, “చూడవయ్యా, నేనెందుకు చెబుతున్నానో కాస్త ఆలోచించు. ఎంతో ఆలోచించి మరీ చెబుతున్నాననుకో. పిల్ల చదువు మానిపించెయ్యి. కాంతం చాలా బుద్ధిమంతురాలే, కాదన్ను కాని, లోకం కాంతం సంగతి ఏ మెరుగును? బియ్యేలూ, ఎమ్మేలూ చదివిన ఆడపిల్లలు చెడిపోయినవాళ్ళేననుకుంటుంది. అంత చదువుకున్న ఆడపిల్లను చేసుకున్న వాళ్ళను గురించి నలుగురూ చాటున ఎట్లా చెప్పుకుంటారో నీకేం తెలుసు?”– ఈ ధోరణిలో ప్రారంభించాడు.

పాపం, ఆయన ఇప్పటినుంచే కాంతాన్ని తన కోడలుగా చూసుకుంటున్నాడు. అయిదేళ్ళు ఆగటానికి ఆయనకు అభ్యంతరం లేదుకాని, ఈ అయిదేళ్ళలోపున నేను కాంతాన్ని తన కోడలుగా పనికిరాకుండా తయారు చేస్తానని మహాదిగులుపడి పోతున్నాడు. నేనా సంగతి గ్రహించాను గనక ఆయన చెప్పేదానికి ఔననకుండా, కాదనకుండా తప్పించుకుంటూవచ్చాను.

కాని రోజూ ఇదే సొద అయితే ఎట్లా భరించటం? చివరకు చూసి చూసి “మీరుకూడా, మతిలేని వెధవ లెవరో అనవలసిన మాట లంటారేమిటండీ? ప్రపంచంలో నీచులెవరో ఏదో అనుకుంటారని లక్ష్యపెట్టేట్టుంటే మనం ఒక క్షణం బతగ్గలమా?” అన్నాను.

నే నన్న తిట్టు తనకే తగలటం చేత కాబోలు అరనిమిషం పాటు ఆయన మొహం జేవురించి, ఊపిరి సరిగా ఆడలేదు. కాని నే నన్న వాక్యంలో ‘మనమూ మనమూ వియ్యంకులం’ అనేది ధ్వనించటం చేత పర్యవసానంలో తృప్తిపడి, “అదీ నిజమే అనుకో–!” అన్నాడు.

ఆయన్ని ఇట్లా మాటలతో మభ్యపెట్టడం నాకూ బాధగానే ఉన్నది. కాని నేనేం చెయ్యగలను? నాకు గత్యంతరం లేకుండా ఆయనే చేస్తున్నాడు...

మా అమ్మాయి పీయూసీ పాసై బియ్యేలో చేరేముందు కనకయ్యగారు అడ్డుపుల్ల వెయ్యటానికి మళ్ళీ ప్రయత్నించాడు.

"చూడవయ్యా! మీ కాంతం బియ్యే చదివేతీరాలంటావా? నే చెప్పేదీ, ఆడపిల్లల చదువు వట్టి డబ్బుదండగే గదా! వాళ్ళేం ఉద్యోగాలు చెయ్యాలా, ఊళ్ళేలాలా? ఆ డబ్బు పెట్టి నిక్షేపంగా నగలు చేయించి పెట్టినా ఫలంపాటు. ఇంటి పట్టున ఉండి ఇంటి పనీ, వంటపనీ నేర్చుకున్నా మాబాగే!" అంటూ నస ప్రారంభించాడు కనకయ్య.

"మీకొక్క రహస్యం చెబుతాను. వింటారూ? ఆడపిల్లలయేది, మగపిల్లలయేది, వాళ్ళకి చదువుమీద ఆసక్తి ఉన్నవాళ్ళూ వాళ్ళకి వెర్రిమొర్రి ఆలోచనలు రావు. వాళ్ళు శ్రద్ధగా చదువుకోవటం వాళ్ళకూ మంచిది, మనకూ మంచిది. ('మనకు' అన్న మాట కావాలనే వాడాను.) కాంతమ్మకు ఏనాడు చదువుమీద నుంచి బుద్ధి మళ్ళి ఇతర విషయం మీదికి పోతున్నట్టు కనబడినా, వెంటనే చదువు మానిపించిటమే కాదు, ఏకంగా పెళ్ళే చేసేస్తాను" అన్నాను.

"సరే, అయితే నీ యిష్టం మరి, అట్లాగే కానీ!" అన్నాడాయన.

ఆయన ఆ మాట అన్నధోరణి చూస్తే నాకే కాస్త భయం వేసింది. ఆయన ఏ మాట మాట్లాడినా మా కాంతాన్ని తన కొడుక్కివ్వటం అనేకమంది సాక్షుల ఎదట ఖరారయినట్లుగా మాట్లాడుతున్నాడు. ఆయన కోసం వేసిన ఉచ్చులో ఆయనతోబాటు నేను కూడా ఇరుక్కుపోతున్నానన్న భావం నాకు కలగసాగింది. పైకి ఏమీ అనకపోయినా, ఆ కనకయ్య లోలోపల, మా కాంతానికి చదువుపై త్వరగా అసహ్యం పుట్టాలని వెయ్యిదేవుళ్ళకు దణ్ణం పెట్టుకుంటున్నట్టు కనబడ్డాడు.

ఇంతలోనే ఆయన, నాకు భయం తీరే మాట ఒకటి అనేశాడు. "పిల్లను కాలేజిలో చేర్చితే చేర్చావుగాని, మగపిల్లలతోబాటు చదివే కాలేజీలో మాత్రం చేర్చకు."

మంచి క్లూ దొరికింది. కనకయ్యను ఊబిలో వదిలేసి, నేనొక్కణ్ణీ పైకి వచ్చెయ్యటానికి మంచి అవకాశం మరేమీలేదు - కాంతాన్ని ప్రెసిడెన్సీ కాలేజీలో చేర్చెయ్యటం - అప్పుడుగాని ఆయనకోసం వేసిన ఉచ్చులు తెంచుకుని నేను బయట పడను, ఆయనా తప్పించుకుపోతాడు. పోనీ, ఆయన మళ్ళీ నా జోలికి రాడు. ఇంతటితో ఆయనకూ, నాకూ రాంరాం!

కాంతాన్ని ప్రెసిడెన్సీ కాలేజీలో చేర్చాను.

"పిల్లను తీసుకుపోయి ప్రెసిడెన్సీ కాలేజీలోనే చేర్చావా? నా కంఠశోషే మిగిలిందన్న మాట!" అన్నాడు కనకయ్య. తన ముందున్న కాఫీ గ్లాసు కూడా తాకకముందే.

"ఏం చెయ్యను? అది ఇంకో కాలేజీలో చేరనన్నది. దాని సబ్జక్టు బాగా చెప్పే ప్రొఫెసరు ఆ కాలేజీలోనే ఉన్నాట్ట" అన్నాను. ఇది నిజమే కూడానూ.

"ఏమోనబ్బా! పిల్లదానికి చదువుమీద ధ్యాస తప్పినట్టే కనబడుతుంది. నువ్వన్నమాట నిలబెట్టుకోదలిస్తే చదువు మాన్పించి, పెళ్ళి చేసెయ్యటానికిదే సమయం!" అన్నాడాయన.

"అది చదువుకుంటాను మొర్రో అంటుంటే, చదువు మానిపించనా? నావల్ల కాదు."

నా స్థితి ఎంత హీనంగా పరిణమించిందో తలచుకుంటే నాకే మండిపోయింది. నేను నా కూతురుకి చదువు చెప్పించుకునే విషయంలో ఈ ముసలినక్కకు సంజాయిషీ యిచ్చుకోవటమేమిటి? ఈయన నా కెవరు? తేరగా రోజూ కాఫీ తాగేసిపోవటంతో పోక! నావాళ్ళను గురించి సలహాలిస్తాడేమిటి? ఇటువంటి దుర్దశ నాకెట్లా కలిగింది? 'వంచించబడకుండా వంచించజాలవు' అని ఏ మహాజ్ఞానిగాని అని ఉండలేదుగదా? నాకు తెలిస్తే ముందే జాగ్రత్తపడి ఉందును.

అయిందేదో అయింది. ఇప్పటికైనా ఈయన మా పిల్లమీద ఆశ వదులుకుని నన్ను వదిలేస్తే ఎంతో సంతోషిస్తాను.

ఆయన కాస్సేపు ఆలోచిస్తూ కాఫీ తాగేసి, తల ఆడించి, "సరే కానీ!" అన్నాడు.

అంటే, నా కూతురు తనకు కావలసిన కాలేజీలో చదువుకునేటందుకు అతి కష్టంమీద తన అనుమతి అనుగ్రహించాడన్నమాట! ఆయనను గొంతుపిసికి చంపాలన్నంత కోపం వచ్చేసింది. అతి కష్టంమీద అణుచుకున్నాను. నా కష్టాలింకా గట్టెక్కలేదు. అంతకంతకూ ముదురుపాకాన పడుతున్న చీకట్లో ఆశారేఖ కనిపించినట్టే కనిపించి అదృశ్యమయింది.

చిత్రమేమిటంటే నాకూ, కనకయ్యగారికీ మధ్య ఎంతోకాలంగా సాగుతున్న ఈ మూగయుద్ధం గురించి మా ఆవిడకు ఏ మాత్రమూ తెలీదు. మా సంభాషణలన్నీ ఆవిడ వింటుండగానే సాగాయి. అందులో ఆవిడకి అర్థంకాని మాటలంటూ ఏమీ లేవు. చాలామంది అమాయికపాఠకుల్లాగే ఆవిడ కూడా 'మాటలు అర్థమైతే భావాలు తెలిసినట్టే' ననుకున్నదేమో. అసలే కాంప్లికేటెడ్ గా ఉన్న పరిస్థితిని ఆవిడ తన ఈక్వేషన్లతో మరింత గందరగోళపరిచి, డొంకతిరుగుడు కథను బాక్సాఫీసు కోసం మరింత అయోమయం చేసుకునే ప్రొడ్యూసరులా ప్రవర్తిస్తుందేమోనని భయపడి నేనేమీ ఆవిడతో చెప్పలేదు.

చెప్పి ఏం లాభం? నాకు కావలసింది కనకయ్యను వదిలించుకోవటం; కాంతం మగపిల్లలతో కలిసి చదవటం మొదలుపెడితే వదులుతాడని ఆశపడ్డాను; కాని వదిలాడుకాడు. అసమర్థుడైన వైద్యుడి చేతిలోపడి చచ్చినంత పని చేసి బతికివచ్చిన రోగిలాగా కనకయ్యగారు కోలుకున్నాడు. నాకు కావలసింది మరో బ్రహ్మాస్త్రం. అది మా ఆవిడ నుంచీ ఆశించటం అవివేకం. వెనకటి శ్రీరామచంద్రమూర్తి వారు ఒక కాకిమీద – పిచ్చుకమీదనైతే ఇంకా బాగుండేది – ఓ గడ్డిపోచ తీసుకుని వేస్తే, అది బ్రహ్మాస్త్ర మయిందిట.

మా ఆవిడ సరిగా దానికి విరుద్ధంగా; నా బ్రహ్మాస్త్రాలను తన విజ్ఞానంతో మంత్రించి గడ్డిపోచల కింద మార్చెయ్యగలదు.

కొన్నాళ్ళు గడిచాయి – నా ప్రాణానికి కొన్ని యుగాలు! తలవని తలంపుగా, అంధకారంలో మరోపక్క నుంచి ఆశాకిరణం కనిపించింది.

పట్టాభికి సంబంధాలొస్తున్నాయి.

పట్టాభికి సంబంధాలొస్తున్నాయని ఓ రోజు కనకయ్యే కొంచెం దిగులుగా బయటపెట్టాడు.

"మన పట్టాభికి సంబంధాలొస్తున్నాయా? భేష్! భేష్!" అన్నాను.

కనకయ్య నాకేసి ఓ పక్కగా, కొంచెం తీక్షణంగా చూశాడు. నేను అంత ఆనందం ప్రకటించి ఉండవలసింది కాదు. ఆత్మనిగ్రహం లేనివాడు అపజయం పొందుతాడు.

కాని, మరి నా కానందంగా ఉంటుందంటే ఎందుకుండదూ? నేను పెట్టిన గడువులో ఇంకా మూడేళ్ళ చిల్లర దిగబడి ఉంది. పట్టాభికి సంబంధాలు రావడం మొదలైతే ఇక ఆగవు. అట్లా వస్తూనే ఉంటాయి – బుకింగులు లేకుండా ఉన్న సినిమా నటుణ్ణి నలుగురు బుక్ చెయ్యగానే నలభై మంది ప్రొడ్యూసర్లు ఎగబడ్డట్టు! – అది లోకరీతి.

"పట్టాభికి సంబంధాలెందుకురావూ? నిక్షేపమంటి కుర్రవాడు. మంచి బుద్ధిమంతుడు" అన్నది మా ఆవిడ.

కనకయ్య బాధగా మూలిగాడు. బాధ ఎందుకో నాకు తెలుసు. మా కాంతాన్ని వదులుకోవటం ఇష్టంలేదు. ఒకవేళ అంతకన్న మంచి సంబంధం వస్తే దాన్ని వదులుకోవటమూ ఇష్టంలేదు. కాని పై సంబంధాలు చూడటం మొదలుపెడితే, మా ఇద్దరి మధ్యా ఇంతకాలంగా నడుస్తున్న మూగయుద్ధం నుంచి ఆయన పరారీ అయిపోయినట్టే! నా పిలక ఆయన చేతినుంచి ఒకసారి జారిపోతే మళ్ళీ దొరక్క పోవచ్చు! అదీ ఆయన బాధ.

❁ ❁ ❁ ❁ ❁

ఒకరోజు సాయంకాలం నేనింటికి వచ్చేసరికి మా ఆవిడా మా కాంతమ్మా చాలా హడావుడిగా ముస్తాబవుతున్నారు.

"ఎక్కడికైనా ప్రయాణమా?" అని అడిగాను.

"వచ్చారా? బట్టలు విప్పెయ్యకండి. పెళ్ళి చూపులకు వెళ్ళాలి" అన్నది మా ఆవిడ.

ఏం పెళ్ళి చూపులు? మా కాంతాన్ని చూడటానికి ఎవరన్నా వస్తున్నారా? ఎవరన్నా వచ్చేట్టుంటే మేమెందుకు వెళ్ళటం? అసలు నా అనుమతి లేకుండా పెళ్ళిచూపులు ఎట్లా జరుగుతాయి? మా ఆవిడ నాకు తెలీకుండా ఏం వెర్రి ఏర్పాట్లు చేస్తున్నది?

"ఏం పెళ్ళిచూపులు? ఎవరికి? ఎక్కడ?" అన్నాను గబగబా.

"పట్టాభికి సంబంధమండీ! ఎవరో ఏకంగా పిల్లను తీసుకొస్తున్నారు. మనని ఓ పావుగంటలో బయలుదేరిరమ్మని కనకయ్యగారు వాళ్ళ చిన్నబ్బాయిచేత కబురు చేశారు" అన్నది మా ఆవిడ.

"ఓ అరగంటకిందట–" అని మా కాంతం పూర్తిచేసింది.

"అత్రగొట్టు బ్రాహ్మణార్థాని కెళ్ళినట్టు, అందరికన్నా ముందెళ్ళి కూచుంటామా ఏం? వచ్చినవాళ్ళు వెంటనే చివాల్న లేచివెళ్ళిపోరుగా?... హయ్యో రాత! ముదినాపసానిలా ఆ ముత్యాకలమ్మలు పెట్టుకుంటున్నావేమిటే? జుంకీలు పెట్టుకో... జుట్టు చూడు, ఎట్లా చెవుల వెనకనుంచి ఈడ్చుకున్నదో? చెవులమీదికి లాక్కోవే దద్దమ్మా!.."

మా ఆవిడ హడావుడి చేస్తే చేసిందిగాని, మా కాంతాన్నే ఎవరో పెళ్ళివారు చూడవస్తున్నట్టుగా దాన్ని ఎందుకు ముస్తాబు చేస్తున్నదో నా కర్థం కాలేదు. మా కాంతం వీలయినంత అనాకారిగా కనపడవలసిన సమయంలో, దాన్ని ఊర్వశి వేషానికి ముస్తాబు చేసినట్టు చెయ్యటమేమిటి? మా ఆవిడకు ఎట్లా అర్థమవుతుంది? ఎట్లా తెలియజెప్పటం?

వెనక నేను అహమ్మదాబాదులో ఉండేప్పుడు ముకుంద్జీభాయ్ కూతురి పెళ్ళికి అతని మేనగోడలు వచ్చింది. అసలే చాలా అందగత్తె; దానికితోడు చచ్చేట్టు డ్రెస్ చేసుకొచ్చింది. ఆ పిల్ల పక్కన పెళ్ళికూతురు ట్యూబ్‌లైట్‌లో కిరసనాయిలు బుడ్డిదీపంలాగా అయిపోయింది. ఆ రోజు నాకు ముకుంద్జీభాయి మేనగోడలిమీద వచ్చిన కోపం ఇంతా అంతాకాదు. ఈ విషయం మా ఆవిడకు లక్షసార్లు చెప్పాను. మరేమీలేదు, ముకుంద్జీభాయి కోటీశ్వరుడింట్లో పెళ్ళికి నన్ను ఆహ్వానించారని జ్ఞాపకం చెయ్యటానికి!

అటువంటి పొరపాటే ఇప్పుడు మా ఆవిడ కాంతం చేత చేయిస్తున్నది. మరో సందర్భంలో అయితే నేను పట్టించుకోకపోదును. కాని ఈసారికి కాంతం ఆ వచ్చే అమ్మాయికన్న సాధ్యమైనంత వికారంగా కనపడటం ఎంతైనా అవసరం. లేకపోతే నా యుద్ధ తంత్రమంతా తలకిందులైపోతుంది.

కాని కాంతం ముస్తాబు కానే అయింది. ఉన్న చీరెల్లోకి మంచిది కట్టేసింది. చెవులకు జుంకీలు పెట్టేసింది. జుట్టు చెవుల మీదికి లాక్కున్నది. ముస్తాబు చెడగొట్టుకోమంటే ఇద్దరాడాళ్ళూ ఏకమై నా పీక నులిమేస్తారు.

"అమ్మాయి కూడ రావలసిన అవసరం ఉంటుందంటావా?" అన్నాను కుంటిగా.

"మీకేమన్నా మతిపోయిందా ఏమిటి?" అన్నది మా ఆవిడ.

మనం విధిచేతిలో ఎటువంటి కీలుబొమ్మలమో నాకా క్షణంలో అర్థమయింది.

కనకయ్యగారి చిన్నవాడు మళ్ళీ వచ్చి "వాళ్ళంతా వచ్చారు. నాన్న మిమ్మల్ని వెంటనే రమ్మంటున్నారు" అని తుర్రున పరిగెత్తి పోయాడు.

మరో అయిదు నిమిషాల్లో మా ఆవిడ ముస్తాబు ముగించి, మాదే ఆలస్యమైనట్టు, "ఆఁ, ఆఁ! పదండి, పదండి! ఇంకా నిలబడే ఉన్నారేం?" అని మమ్మల్ని మహాతొందర పెట్టింది.

నేను భయపడ్డంతా అయింది. ఆ వచ్చిన పెళ్ళి కూతురు మంచి ఖరీదయిన బట్టలే వేసుకుందిగాని, ఏమంత అందగత్తె కాదు. మా కాంతం పెద్ద అందగత్తె అని అనను కాని, ఆ పిల్ల ఆ మాత్రం కూడా లేదు. దానికితోడు ఆ పిల్లకు అలంకరించిందెవరో గాని, వాళ్ళ కా పని బొత్తిగా చేతకాదు.

పెళ్లి కూతురి వెంట తల్లీ, తండ్రీ, పినతండ్రీ వచ్చారు. పెళ్ళి కూతురు తల్లి మా కాంతాన్ని కొరకొరా చూడటం గమనించాను. పట్టాభి – తనకు చాలా ఇష్టమయిన యజమానిచేత అకారణంగా శిక్ష పొందిన కుక్క ఆ యజమానిని చూసినట్టుగా – కరుణ రసం ఉట్టిపడేలాగా మా కాంతం కేసి చూడటం కూడా గమనించాను.

మేం ఇంటికి తిరిగొచ్చాక మా ఆవిడ ఎంతో గర్వాన్ని అణుచుకుంటూ, "అది సరే! ఆ పెళ్ళికూతురు తల్లి మనమ్మాయికేసి అట్టా తినేట్టు చూస్తూందేఁవిటీ" అన్నది.

"వాళ్ళు తెచ్చినట్టే మనం కూడా మనమ్మాయిని పెళ్ళి చూపులకు తెచ్చామనుకుని ఉంటుంది. యాచకో యాచక శ్శత్రుః... ఇంతకీ పిల్ల ఎట్లా వుంది?" అన్నాను.

"బాగానే ఉంది. పాపం!" అన్నది మా ఆవిడ. "పాపం!" కీవర్డ్.

"చక్కగా ఉంది!" అన్నది కాంతం.

"వాడు, ఆ పట్టాభి దానికేసి చూడ్డేం?" అన్నాను.

"సుబ్బరంగా చూశాడు. మీకు తెలీకపోతే ఊరుకోండి" అన్నది మా ఆవిడ.

"చేసుకుంటాడంటావా?" అన్నాను.

"ఎందుకు చేసుకోకూడదూ? తీపరమా? నాలుగువేలు కట్నం ఇస్తామంటున్నారట" అన్నది మా ఆవిడ.

"నిన్ను సలహా అడిగితే చేసుకోమంటావా? కనకయ్యగారు తప్పకుండా అడుగుతారు."

"కళ్ళకద్దుకుని మరీ చేసుకోమంటాను. ఏం? మీరు వద్దని సలహా ఇస్తారా?" అన్నది మా ఆవిడ భయపడుతున్నదానిలాగా.

ఏ పరిస్థితిలో అయినాసరే ఓ పెళ్ళి జరగటమే ఆడవాళ్ళకు కావలసింది. మా ఆవిడ ఆ బుద్ధిన ఉండటం నాకు లాభమే. కాని నేను ఈ సంబంధాన్ని బలపరుస్తానని తెలిస్తే, ఆవిడ తన ఈక్వేషన్ అడ్డేసి పథకమంతా పాడుచేసెయ్యొచ్చు.

అందుకని నేను ఆమదం తాగిన మొహంపెట్టి, "ఏమో, నాకీ సంబంధం అంత

పెద్దగా నచ్చలేదు. పట్టాభికి ఇంకొంచెం మంచి సంబంధమే రావచ్చునేమో అనుకుంటున్నాను" అన్నాను.

"నాక్కూడా అట్టాగే అనిపించింది" అన్నది మా కాంతం ఎవరూ అడక్కుండానే.

దీపాలు పెట్టిన కాస్సేపటికి కనకయ్య వచ్చాడు.

"పిల్లను చూశారుగా, మీకేమనిపించింది?" అని అడిగాడు.

"పిల్లకేమండీ? రత్నంలాగుంది. నన్నడిగితే చేసుకోవచ్చు నంటాను. మా వారికే అంత నచ్చినట్టులేదు" అన్నది మా ఆవిడ.

నాపాలిట శని దాపురించింది! లౌక్యం లేదు. పాడూలేదు. అడిగేవాడు నెహ్రూ అయినాసరే, మమ్మల్నిద్దరినీ కలిపి ప్రశ్న వేస్తే, ఏం చెబితే బాగుంటుందో నేను ఆలోచించే లోపల, తన నోటికి వచ్చింది నాకన్న ముందు చెప్పేస్తుంది. తాను చప్పున ఏదో ఒకటి అనకపోతే నేనేం తొస్సు సమాధానం చెబుతానో అని భయం పాపం.

"ఇకనేం, ఈ సంబంధం వదిలేస్తాను" అన్నాడు కనకయ్య. నా అంతర్యం గ్రహించినవాడల్లే నాకేసి ఓ చిరునవ్వు విసిరి, వెళ్ళిపోయాడు. ఆశారేఖ కాస్తా గుట్టుక్కున ఆరిపోయింది.

❀ ❀ ❀ ❀ ❀

మా కాంతం బియ్యే పాసుకావటం అయిందిగాని, క్లాసు రాలేదు. దానికి చదువు మీద రోతపుట్టిన లక్షణాలన్నీ కనిపిస్తున్నాయి. ఈ సంగతి కనకయ్యకు తెలిస్తే నన్ను బతకనివ్వడు.

"ఎమ్మేకు అప్లికేషన్ వెయ్యి మరీ" అన్నాను కాంతంతో. జూదంలో ఓడిపోతున్నవాడు శాయశక్తులా ఆడుతూపోవటం తప్ప మార్గాంతరం లేదు. చదువంటే ఇష్టం ఉన్నా, లేకపోయినా, కాంతం కాలేజీకి పోతూ వస్తూ ఉన్నంతకాలమూ కనకయ్య నన్ను ఓడించలేడు.

"చదివింది చాల్లే నాన్నా! బియ్యేలో క్లాసొస్తే చదవబుద్ధి అయేదేమో! ఈ వంటబట్టని చదువెందుకు? డబ్బుచేటు!" అన్నది కాంతం.

నాకు భయం వేసింది. కనకయ్య సింహస్వప్నమై కూర్చున్నాడు.

"అదేమిటే? మనం ఇన్నాళ్ళూ అనుకున్న ప్లానంతా పాడుచేసేస్తివే? బియ్యేలో రాకపోతే రాకపోయింది. ఎమ్మేలో క్లాసు తెచ్చుకో. ఇంతా చదివి కాస్త మంచి ఉద్యోగం చెయ్యకుండా, మొగుడు సంపాయించి పెట్టే మెతుకులు తిని బతుకుతానంటావా?" అని కాంతాన్ని రెచ్చగొట్టాను.

"ఇప్పుడు నేను నా సంపాదనతోనే మెతుకులు నోట్లో వేసుకుంటున్నానా?" అన్నది కాంతం నవ్వుతూ.

"ఇక్కడి దారివేరు! ఇది నీ పుట్టిల్లు. నీకు సొంతం. నీ తండ్రి సంపాదించి పెడుతున్నాడు. హాయిగా తింటున్నావు" అన్నాను.

"రేపు అత్తవారిల్లే సొంత ఇల్లవుతుంది. మొగుడు సంపాదించి పెడితే హాయిగా తినొచ్చు" అన్నది కాంతం.

"అదీ ఇదీ ఒకటి ఎట్లా అవుతుంది?"

"ఎందుక్కాదు, నాన్నా? పరాయిల్లల్లే ఉండే అత్తవారింటికి కాపరానికి పోకపోతేనేం? పరాయివాడల్లే ఉండే మొగుణ్ణి చేసుకోకపోతేనేం? నేనెప్పటికన్నా చేసుకొంటే నా సొంత మనిషల్లే ఉండేవాణ్ని చేసుకుంటాను. సొంత యిల్లనిపించే ఇంటికే పోతాను" అన్నది కాంతం.

అది నాకన్న రెండాకులు ఎక్కువే చదినట్టు కనబడింది.

నోరుచేసుకుని అడగలేదు గాని, దానికి కావలిసింది పెళ్ళి! ఆ సంగతి తెలుస్తూనే ఉన్నది.

"సిద్ధాంతరీత్యా నువ్వన్నది నిజమే. కాని నీకు ఆత్మీయుడుగా ఉండే మొగుడు దొరికే సమస్య అంత తేలికైనది కాదు. మా ప్రయత్నం వల్ల అటువంటివాడు దొరకాలి. లేదా నువ్వైనా సంపాదించుకోవాలి" అన్నాను. ఈ మాటకు కాంతం కొంచెంగా బెదురుతుందనుకున్నాను.

బెదరలేదు సరికదా కాంతం అతి చిన్న నవ్వొకటి నవ్వి, "నువ్వు సంబంధాలు చూచినప్పుడు నా అభిప్రాయం నేను చెబుతాలే" అన్నది.

నేను వెంటనే సంబంధాలు చూడసాగాను.

సంబంధాలు చూడటమనేదానికొక నిర్దిష్ట కార్యక్రమం లేదు. కనపడ్డవాళ్ళందరి తోనూ, కావలసిన వాళ్ళందరితోనూ, మన అమ్మాయికి పెళ్ళి చేద్దామనుకుంటున్నట్టు చెబుతాం. కట్నం ఇంతదాకా ఇవ్వగలమనీ, పెళ్ళి కొడుకు కనీస అర్హతలు ఇట్లా ఇట్లా ఉండాలనీ చెబుతాం. ఎక్కడన్నా ఎవరన్నా ఒక పిల్లను చూసి వదిలేశారని తెలిస్తే, అది మంచి సంబంధమేనని మనకు తోస్తే దానికోసం ప్రయత్నిస్తాం. అంతా షేర్‌బజారు తంతు.

నేను మా కాంతానికి సంబంధాలు చూట్టం మొదలుపెట్టగానే, మీకు నా మీద గురి కాస్తా పోయి ఉండవచ్చు. 'పెళ్ళి చెయ్యకుండా చూడు' అన్న సూత్రానికి నేను స్వస్తి చెప్పాననుకుని ఉండవచ్చు. యుద్ధంలో దెబ్బతియ్యటానికే తిరోగమించినట్టుగానే నేను,

'పెళ్ళి చెయ్యకుండా చూడు' అనే సిద్ధాంతం మీద నిలబడటానికి సంబంధాలు చూడ నారంభించాననుకోండి.

సంబంధాలు చూస్తున్నట్టు కనకయ్యకు తెలియజెయ్యటం నా స్ట్రాటజీలో అతి ముఖ్యమైన అంశం.

"ఏమండోయ్, మావారు పిల్లకు సంబంధాలు చూస్తున్నారు" అని మా ఆవిడ నాకన్న ముందే ఆయనతో చెప్పేసింది. ఆవిడ నోటి మీదుగా చెప్పనిద్దామనే నేను చెప్పలేదు.

కనకయ్యగారు నాకేసి, 'ఔరా, ద్రోహీ!' అన్నట్టు చూశారు.

"ఆc, ఏం చూట్టంలెండి? అనకాపల్లి సంబంధం ఓటి చూశాను. పిల్లవాడికి రెండు లక్షల ఆస్తి ఉందిట. ఎమ్మే ప్యాసయి ఊరికే కూర్చున్నాట్ట. డాక్టరేటుకు ఏదో థీసిస్ తయారు చేస్తున్నానని అందరితోటీ చెబుతున్నాట్ట. సరే, డాక్టరేటు రానివ్వండీ, అప్పుడే చూడొచ్చు. ఏమంటారు? కనీసం డాక్టరేటయినా, ఓ చిన్న కలెక్టరు ఉద్యోగమన్నా లేనివాడికి పిల్లనివ్వటం నాకిష్టంలేదు. పిల్లను తెచ్చుకునేటప్పుడు తక్కువ చోటినుంచి తెచ్చుకోమన్నారు. ఇచ్చేటప్పుడు పెద్దచోట ఇయ్యమన్నారు. ఏమంటారు?" అన్నాను.

'అదా నీ వరస?' అన్నట్టు కనకయ్య తలపైకీ కిందకీ ఆడించి, కాఫీ తాగి, మాటా పలుకూ లేకుండా వెళ్ళిపోయాడు.

దేశంలో ఉన్న గొప్ప గొప్ప సంబంధాలేవో తెలుసుకోవటమే కొంచెం కష్టమయింది. ఆ తరవాత వాళ్లకొక కార్డుముక్క రాసి పారేస్తే ఆ సంబంధం మనం చూసినట్టే; వాళ్ళ దగ్గిర్నుంచి జవాబు రాకపోయినా, మనం చూసేసినట్టే చెప్పుకోవచ్చు. సంబంధాలు చూడటమనే ఫ్రాడ్‌లో తిరుగుళ్ళన్నీ నన్నడగండి, చెబుతాను. ఇంట్లో ఆడవాళ్ళను ఫూల్ చెయ్యటానికి సవాలక్షమార్గాలు.

మా ఆవిడ నిజంగా నేను పిల్లకోసం గొప్ప గొప్ప సంబంధాలు చూస్తున్నాననే అనుకున్నది.

చిక్కేమిటంటే కాంతం కూడా అనుకున్నది. అది నన్ను దబాయించి, "నాకోసం చాలా సంబంధాలు చూస్తున్నావుట. నాతో మాటమాత్రం చెప్పవేం?" అని అడిగింది.

"మనకు పనికొస్తుందన్న సంబంధం రావాలేగాని నీకు చెప్పనుటే?" అన్నా.

ఆ తరవాత మూడు రోజులకో నాలుగు రోజులకో తలవని తలంపుగా పట్టాభి మా ఆఫీసుకొచ్చాడు. అతడి మొహం చూస్తే గుర్రప్పందాల్లో అంతా పోగొట్టుకుని, రైలు చార్జీ కూడా లేక, గిండీ నుండి ఇంటికి నడిచివచ్చినవాడిలాగున్నాడు.

"ఏం పట్టాభీ? ఏదో పనిమీద వచ్చినట్టున్నావు?" అన్నా.

"అవునండీ, ఓ ముఖ్యమైన విషయం మాట్లాడాలి.... మీ కాంతంకు సంబంధాలు చూస్తున్నారుటగా."

"అవును, ఏం?" అన్నా.

"ఏం లేదు. మీరు చూస్తున్న సంబంధాల్లో నన్ను కూడా చేర్చి ఉంచండి."

"ఈ ఐడియా ఎవరిది? నీదా, మీ నాన్నగారిదా?"

"మా నాన్న మాట ఎత్తకండి? అనగూడదుగాని, ఆయన వట్టి ఫూల్."

"పెద్దవాణ్ణి పట్టుకుని పుటిక్కిన ఎంత మాటన్నావూ? అయితే ఇది నీ ఆలోచనే అన్నమాట!... నీకు ఛాన్సుంటుందంటావా?"

"ఉంటుందనే అనుకుంటున్నా. వ్యర్థ ప్రయత్నాలు చెయ్యటం నాకు చాలా అసహ్యం" అన్నాడు పట్టాభి. పట్టాభిలో ఈ మాత్రం పలుకున్నదని నే నెరగను.

"అట్లా ఐతే నీకు ఛాన్సుండదని నేనిప్పుడే చెప్పెయ్యగలను."

"మీరెందుకు చెప్పడం? కాంతం ఏమవుతుందీ?"

"ముందు నాకు నచ్చాలి. ఆ తరవాత కాంతానికి నచ్చాలి. నేను నీ దరఖాస్తు ఆమోదించకపోతే కాంతం ఏం చెయ్యగలదూ?... కాంతం నిన్ను చేసుకోవటానికి ఒప్పుకుంటుందని ఆశ ఉన్నదా?"

పట్టాభి నవ్వి "ఏదో భరోసా ఉండబట్టే మీతో మాట్లాడుతున్నాననుకోరాదా?" అన్నాడు.

ఏమీ సందేహంలేదు; కాంతమూ, ఈ పట్టాభీ అదివరకే మాట్లాడుకున్నారు!

నేను బ్రహ్మాస్త్రం పైకి తీశాను: "చూడు పట్టాభీ! నాకు కట్నం ఇవ్వరాదనే నియమం ఉన్నది. ఆ నియమానికి కట్టుపడి చాలా సంబంధాలు, కాంతంతో చెప్పకుండా కూడా వదులుకున్నాను. నాలుగు పిచ్చికలు నా దగ్గర చేరాయి గదా అనీ, నా కూతుర్ని పెళ్ళాడితే మంచి కట్నం దొరుకుతుందిగదా అనీ నువు ఆశించవచ్చు. అది భ్రమ" అన్నాను.

"నేను కట్నం తీసుకుని పెళ్ళాడేకన్న బ్రహ్మచారిగా ఉండటమే ప్రిఫర్ చేస్తాను. మీరు చెప్పేది మా నాన్నను గురించి లాగుంది!" అన్నాడు పట్టాభి.

నా బ్రహ్మాస్త్రం పారలేదు. ఈసారి పాశుపతాస్త్రం వేశాను.

"తండ్రి ఆస్తికి వారసురాలైన పిల్లను తెలివిగలవాడెవడైనా కట్నం లేకుండానే చేసుకుంటానంటాడు. అటువంటివాడికి ధనాశలేదా ఏమిటి? నువ్వు కట్నం తీసుకోకుండా కాంతాన్ని చేసుకుంటానంటే నేను గర్విస్తాననుకుంటున్నావు గామాలు. అదంతా వట్టిమాట" అన్నా.

కోపంతో పట్టాభి ముఖం కందగడ్డల్లే అయింది.

"మీ పాపిష్టి సొమ్ము నాకు మట్టితో సమానం. మీ రా సొమ్ము ఎట్లా సంపాదించారో నాకు తెలుసు. దానిమీద ఆశ పెట్టుకునేటట్టయితే నేను కాంతాన్ని చేసుకోనని స్పష్టంగా చెప్పాను" అన్నాడతను.

నేను కాస్సేపు అతని ముఖాన్ని శ్రద్ధగా పరీక్షించి, నా దగ్గిర మిగిలి ఉన్న ఒక్క అస్త్రాన్ని ప్రయోగించేశాను.

"నీతో నిజం చెప్పేస్తున్నాను. కాంతానికి పెళ్ళి చేసే ఆలోచన నాకే కోశానా లేదు. నేనసలు ఆ ప్రయత్నంలో లేను" అన్నా.

పట్టాభి తెల్లబోయి, "అదేమిటి అట్లా అంటున్నారు?" అన్నాడు.

"నిజమే చెప్పాను. ఇందులో అబద్ధం ఏమీలేదు. కాంతానికి సంబంధం తీసుకురాగల శక్తి సామర్థ్యాలు నాకున్నట్టు తోచదు" అని చెప్పి పట్టాభిని పంపేశాను. అతను తల వంచుకుని నేలకేసి చూస్తూ వెళ్ళిపోయాడు.

❀ ❀ ❀ ❀ ❀

ఆ తరువాత చెప్పవలసింది ఆట్టేలేదు. పట్టాభి నా దగ్గిరికి వచ్చిన మూడు వారాల కనుకుంటాను - మా ఇంటికొక శుభలేఖ వచ్చింది. అది మా అమ్మాయి పెళ్ళికి పిలుపు - నన్నూ, నా భార్యనూ ఆహ్వానిస్తూ. ఆహ్వానించినవాళ్ళూ మా అమ్మాయీ, పట్టాభీనూ.

ఆ శుభలేక సారాంశం బుర్రకెక్కినాక నా భార్యకు పూనకం వచ్చినంతపని అయింది.

"ఏమిటే ఇదీ? ఏం పనే ఇదీ? ఇదేంపనే? ఇంత పరువుగా బతికి చివరకిల్లా తెగబడ్డావుటే?" అంటూ మా ఆవిడ, ఇంట్లోనే ఉన్న మా అమ్మాయిమీద ప్రశ్నల బాణ పరంపర విసిరింది.

"తప్పేముందమ్మా? రేపు నా పెళ్ళి. నువూ, నాన్నా తప్పకుండా రావాలి. క్లబ్బువాళ్ళ అనుమతితో క్లబ్బులోనే పెళ్ళి ఏర్పాటు చేశాం. ఎనిమిదింటికి రిజిస్ట్రారు వచ్చి, పెళ్ళి రిజిస్టరు చేస్తాడు. అంతా అయిదు నిమిషాల్లో అయిపోతుంది" అన్నది కాంతం.

"ఈ బడాయి ఏమిటే? 'దయచేసి కట్నాలు చదివించవద్దు' అంటూనూ" అన్నది మా ఆవిడ - అది ఆవిడగకు గల ముఖ్య అభ్యంతరాలలో రెండోది అయినట్టూ!....

మర్నాడు మా కాంతాన్ని నా కారులోనే క్లబ్బుకు తీసుకెళ్ళాను. పెళ్ళి సౌమ్యంగా జరిగిపోయింది. కనకయ్యగారింటికి కూడా శుభలేఖ వెళ్ళిందిట. కాని వాళ్ళెవరూ అటుకేసి తొంగిచూడలేదు.

"వాడు నా కొడుకే కాదు" అని కనకయ్య అందరితోనూ అంటున్నాట్ట.

అయిందేదో అయింది. అంతా నేననుకుంటున్నట్టే జరిగింది. కాంతం పెళ్ళి నేను చెయ్యలేదు; కాంతమే చేసుకుంది.

కాని నాకు కొన్ని బెంగలు దిగబడిపోయాయి. మా అల్లుడి ధోరణి చూస్తే కమ్యూనిస్టు వాసన కొడుతున్నాడు. ఆ జబ్బు మా అమ్మాయికీ అంటినట్టు కనబడుతున్నది. నా కష్టార్జితమంతా దానిదైననాడు కమ్యూనిస్టు పార్టీ ఫండుకింద ఖర్చయి పోతుందో ఏమో! ప్రస్తుతం కాంతం నా దగ్గిర ఒక్క పైసాకూడా తీసుకోకుండా ఉంది. ఏం చెయ్యాలో తోచటం లేదు....

***ముద్రణ : జ్యోతి, మాసపత్రిక, దీపావళి సంచిక, 1967***